# పుట్టింటికి

శ్రీ వింజమూరి శివ రామ రావు

ఇరుగమ్మా పొరుగమ్మా సింగారించుకుని కచ్చేరీలనుంచి వచ్చేభర్తలకోసం ఎదురుతెన్నులు చూసేవేళ సరోజిని సజ్జప్రొద్దు కవతల మబ్బుల వెనకాల ఎక్కడికో చూస్తో నిట్టూర్చేది. ఇంట్లో ముసలమ్మ "నీ మొగుడికి ఉద్యోగం కావడం, నువ్వు కాపరానికి వెళ్ళడం నాకళ్ళతో నేను చూడను..." అని ఊరికో ఎప్పుడూ సాధిస్తూంటే ఆమె గ్రుడ్ల నీరు పెట్టుకుని తల వాల్చుకునేది. మగనిమీద జాలిపడుతూ, తనలో తాను విసుక్కుంటూ, అమ్మనీ చెల్లెళ్ళనీ తలుచుకుంటూ రెండేళ్ళు పుట్టింటే గడిపివేసింది.

ఈరెండేళ్ళూ విశ్వప్రయత్నం చేశాడు ప్రభాకరం ఎక్కడైనా సరే మాస్టరీ దొరుకుతుందేమోనని. ఏ కాలేజీకీ, హైస్కూలుకీ తన ఎం. ఏ. డిగ్రీ అక్కరకు వచ్చింది కాదు; ఏ అధికారీ, ఏ యజమానీ, తన తెలివితేటల్ని లెక్కచేశాడు కాదు. చివరికి అతడలాగే నిరుద్యోగిగా, నిరాధారిగా నిలిచిపోయాడు. పిత్రార్జితం చాలవరకు హరించిపోగా మిగిలిన ఆ ఒక్క ఇల్లూ ఇంత అద్దె తెచ్చి ఇస్తూంటే దానితోనే పొట్ట నిండించుకుంటున్నాడు.

"ఏమైనాసరే! నే నింక ఇక్కడ ఒక్కగడియ ఉండను. ఆయనతో పాటు కలో గంజో కాచుకుని తాగుతూ పడుండాలిసిందే" అంది సరోజిని తండ్రితో, "అతను ఉద్యోగం కాక ఇబ్బంది పడుతున్నాడు గదా! నువ్వు కూడా ఎందుకమ్మా! ఇక్కడ నీ కేమి లోటని... కావలిస్తే అతన్నికూడా వచ్చి ఉండమందాం, ఉద్యోగం ఏదేనే అయేదాకా" అన్నాడు సరోజిని తండ్రి.

"ఆయన ఇక్కడికి వచ్చి ఉండరు నాన్నా! నాకు బాగా తెలుసు... నన్ను వెళ్ళనీ... ఎల్లకాలం ఒక్కతీరుగా ఉండదుకదా!" "చాలా బాధ పడతావు తల్లీ! బాగా ఆలోచించు. మీకు ఎత్తి పెట్టేటంత ఉన్నవాణ్ణి కాదుగదా..."

"ఒక రిచ్చేదేమిటి నాన్నా! ఎవరి మట్టుకు వారు సంపాదించుకోవాలి గాని. ఏమైనా సరే ఎల్లుండి నాప్రయాణం తప్పదు" అని చెప్పి వంటింట్లోకి చక్కాపోయింది సరోజిని.

తనకే ఆ కాలేజీలో లెక్చరర్ పని అవుతుం దని ఎంతో ఆశపడ్డాడు ప్రభాకరం, గాలిలో ఎన్నో మేడలు కట్టుకున్నాడు; కాని సమయానికి ఆ అఠావాయన అడ్డు వస్తా డని అతను కలలోకూడా అనుకోలేదు. అదే చింతతో కూర్చున్న అతనికి 'ఇంటిముందు బండి ఆగిన అలికిడి వినిపించింది. అతను లేచేసరికి ఎదురుగా సిగ్గుతో, కొంచెం భయంగా, నిలబడి వుంది సరోజని, తల వాల్చుకుని...'

ఒక్క సంవత్సరం ప్రణయరాజ్యాని కేలికలై కాపరం చేశారాయిద్దరూ. అతని ఉద్యోగం కాలేదే అనే బెంగ ఆమెకూ, ఆమె నికమీద ఎలా పోషించేదీ అనే దిగులు అతనికీ లేకుండా ప్రపంచాన్నే మరచిపోయారు ప్రేమలోపడి. ఆమె పుట్టింటినుంచి తెచ్చుకున్న సొమ్మంతా అయిపోయిం దనే సంగతికూడా వారు గమనించ లేదు కొంతకాలంవరకూ. తెలుసుకున్న తరువాత ఇద్దరకీ గుండెలు కొట్టుకున్నాయి, రోజులు గడిచే దెలాగరా అని, ఆమె ప్రోత్సహించింది. అతడు దీక్షవహించాడు; ఏదైనా నౌకరీ సంపాదించా అని. కాని ఇచ్చేదెవరు?

ఒకనాడు మధ్యాహ్నం ఎండలో చెమటలు కక్కుకుంటూ ఇల్లు చేరుకున్నాడు ప్రభాకరం. గుమ్మంలోంచి ఏమైందని ఆత్రంతో అడిగింది సరోజిని. అతడు మడతకుర్చీలో వెన్ను వాల్చి నిట్టూర్చు "తెలుగువాడికి బంట్రోతుపనికూడా దొరకదు. ఏ తెలుగుసంస్థా అభివృద్ధి చెందడానికి

వీలులేదు. ఏ తెనుగుకళా తలెత్తుకునేందుకు తావులేదు. ఏ తెనుగువ్యక్తి ఉద్యోగస్థుడవుతాడనే ఆస లేదు. ఎప్పటికైనా ప్రత్యేకాంధ్రరాష్ట్రం వస్తే ఏమోగాని, లేకుంటే ఆంధ్రజాతికధోగతే ఇంకముందు..." అన్నాడు.

"సరేగాని లేచి స్నానం చెయ్యండి; వంట అప్పుడే చల్లారిపోయింది" అని సరోజని ప్రభాకరాన్ని లేవదీసింది. భోజనం చేస్తూంటే అతడామెతో "పోనీ, ఒకటి రెండు నెలలపాటు నువ్వు మీపుట్టింటికి వెళ్ళి రాకూడదూ! ఈలోగా నేను ఎక్కడైనా, ఏచిన్నపనైనా సంపాదించుకుంటా" అన్నాడు. ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. అది చూచి మళ్ళీ అతనా ప్రశంస తేలేదు.

ఇల్లు తాకట్టుపెట్టి సొమ్ము తీసుకువచ్చాడతను. ఇంటిలోకి కావలసిన వన్నీ వద్దురావి తెప్పించిన దామె. ఒకరి నొకరు హెచ్చరించుకుంటూ, అనునయించుకుంటూ ప్రేమలో కొంతకాలం గడిపేశారిద్దరూ. ఆ సొమ్ము ఖాస్తా అయిపోయింది. ఉద్యోగం కోసం ఆమె వెయ్యిదేవుళ్ళకి మొక్కుకుంది; అతడు శతవిధాల ప్రయత్నం చేశాడు. కాని ఏ దేవుడికీ హృదయం కరగ లేదు; ఏ ప్రభువుకీ బుద్ధి పుట్టలేదు.

ఒకనాటిరాత్రి ప్రొద్దుపోయి ఇంటికి వచ్చాడు ప్రభాకరం. మంచి ఆకలితో నీరసంగా పడుకున్న సరోజని నెమ్మదిగా లేచి అతని మొహం వంక చూచి "పని కాలేదు కాదూ" అని. "ఎలా ఔతుంది? ఆంగ్లోఇండియన్లు చిన్నపనులు మాత్రం చేయలేరో? ...... నీభోజనమైందా" అన్నాడు, "వంట కూడా కాలేదు ... కావడానికి ఇంట్లో ఏమీ లేవు..." అతడు లేనినవ్వు తెచ్చుకుని, ఆమెను ముద్దు పెట్టుకున్నాడు ఆమె లేనిసత్తువ తెచ్చుకుని అతని మెడ చుట్టూ చేతులు పెనవేసింది. పడుకుని ఉండగా— "పోనీ ఒకటి రెండు నెలలుపాటు మాపుట్టింటికి వెళ్ళి వస్తాను. ఈలోగా మీకేమైనా పని కుదురుతుందేమో" అంది ఆమె. అతని మొహం ఎర్రగా అయిపోయింది. అది చూసి మళ్ళీ ఆమె ఆ సంగతి ఎత్తలేదు.

ఆమె ఒంటిమీద వెండిబంగారాలు క్రమక్రమంగా మార్వాడీ దావాని కావలయ్యాయి. అతని ఇంటిలోని పాత్రసామాను ఒక్కొటొక్కటీ కాబూలీవాడి వడ్డీకింద చెల్లుబడి అయినాయి. ఆమె లోలోపల కుమిలిపోతూ వుంది. అతడు ఎక్కడెక్కడికో పోయి అడుగుతూనే వున్నాడు. కాని ఎక్కడా కలిసిరావడం లేదు. చివరికి ఆ ఇల్లు కూడా అమ్మకోవలసివచ్చింది, పొట్టకోసం; ఇంక నిలవ నీడకూడా లేదు. ఏపూట కాపూట తిండి కలాగా అనే దిగులే!

“మంచి సినిమాలు — ఊరంతా వెడుతున్నారు — మనంకూడా వెడదామా! చాలారోజులైంది టాకీ చూసి—” అంది సరోజని. “డబ్బేదీ? అప్పుకూడా ఎవరూ ఇయ్యరు నాకు. ఉద్యోగం అవనీ; రోజూ వెడదాం” అన్నాడతను.

“పండగ గదా! బొబ్బట్లుచేసి పెడుదూ — తినాలని ఉంది. చాలా రోజులైంది కాదూ నువ్వు బొబ్బట్లు చేసి” అన్నాడు ప్రభాకరం.

“ఏమి పెట్టి చేసేది? అప్పుసైతం దొరకదాయె. ఉద్యోగం అవనీండి- కావలసినన్ని” అంది ఆమె.

ఇంక ఏదారీ లేక మామగారికి ఉత్తరం వ్రాశాడు ప్రభాకరం, ఏమైనా సాయం చేయవలసిందని, జవాబు లేదు. సరోజనికూడా వ్రాసింది, ఉద్యోగం కాగానే నెలనెలా ఋణం తీర్చుకొంటామని. పంపడానికి ఏమీ తనవద్ద లేదనీ, వచ్చి తనయింట్లో ఉంటే తన కేమీ అభ్యంతరం లేదనీ జవాబు.

దారిద్ర్యం, నిరుద్యోగం కలిసి, కుట్రచేసి ఆదంపతుల్ని పిశాచాల్లాగ పట్టుకుని పీడించడం మొదలు పెట్టాయి. ఎక్కడకు వెళ్ళినా పరువులేదు; ఏపని చేసినా మెప్పులేదు. ఎర్రబడిన కళ్ళతో, పెరిగిపోయిన గడ్డంతో, మాసిపోయిన బట్టలతో తిరిగే ప్రభాకరాన్ని చూసి, ఉద్యోగం ఇయ్యకపోయినా ఇదివరకల్లా మర్యాదగా మాట్లాడే అధికారి అతనివంక చూడ

నైనా చూడలేదు. చిక్కిపోయిన చెక్కిళ్ళతో, రేగిపోయిన తలకట్టుతో, చిరిగిపోయిన చీరతో వచ్చే సరోజని చూచి అవ్వ ఇద్యాకపోయినా, ఇంతవరకూ జాలిగా పలకరించే పక్కయింటావె తలుపు వేసికొని లోపలికి చక్కాపోయింది.

క్రమక్రమంగా అతనికి చిరాకు ఎక్కువైపోయింది. ఆమెకు ఓరిమికూడా తగ్గిపోయింది. అయినదానికీ కానిదానికీ అతడామెను తిట్టడం మొదలు పెట్టాడు. ఊరుకోకుండా ఆమె అతణ్ణి ఎదిరించడం మొదలు పెట్టింది. అతడు కాస్త చేయి చేసుకోవడం, ఆమె పనులన్నీ మానివేసి ఏడుస్తూ పడుకోవడం మామూలైపోయినాయి. పండంటి కాపరానికి దారిద్ర్యం, నిరుద్యోగం చిచ్చుపెట్టాయి—

ఆదరవు ఏమీ లేదనే కోపంతో అన్నంకూడా వండకుండా పడుకుంది సరోజని ఒకనాడు. ప్రభాకరం అదిచూసి ఆమెను నాలుగు తన్నాడు.

"పెట్టేది లేదు, పోసేదీ లేదు, కొట్టడంకూడా ఎందుకు? ఇష్టముంటే ఇలా ఉండనీయండి; లేకుంటే పుట్టింటికి పోతాను" అనేసిందామె. "పోతే పో! ఇక్కడ నిన్ను కట్టిపెట్టిందెవరు? కని విరగడై పోయిందను కుంటాను" అనేశాడతను గట్టిగా.

పూస్టరీవని ఒకటి ఖాళీ అయిందనీ, ప్రభాకరం వస్తే ప్రయత్నం చేస్తానని ఒక స్నేహితుడు తనపేర వ్రాస్తే, భార్యమెడలో మిగిలివున్న పుస్తె అమ్మేసి, అతను ఊరికి వెళ్ళాడు. కాని ఒక బెంగాలీబాబుకి అపని అయిపోయింది. ఈ తెలుగువాడు మళ్ళీ నిరుద్యోగి!

తాను తిండికి గుడ్డకి లేక అవస్థపడుతున్నాననీ, వెంటనే రాకపోతే ప్రమాదమనీ సరోజని తండ్రిపేర ఉత్తరం వ్రాస్తే, ఆయన వచ్చి ఆమెను ఎవరితోనూ చెప్పకుండా తీసుకుపోయాడు. ప్రభాకరం ఇంటికి వచ్చి చూచేసరికి తన నూటుకేసు ప్రక్కన సరోజని కావడిపెట్టె కనబడ లేదు. ఎదురుగా గూట్లో ఆమె బొట్టుపెట్టె లేదు.

ఇష్టా, వాకిలి లేక, తో లుకిలికలు కొలువు చుట్టబెట్టుకుని పిశాచగణంతో పర్యటనం చేసి వచ్చి, ఒకరినొకరు వదలకుండా ఉమామహేశ్వరులు ఆనంద-నృత్యం చేసే ఆ సంజకెల, చెదరిపోయిన పక్కమీద వాడి పడి ఉన్న శాలపూవుల వంక రెప్ప వాల్చకుండా చూస్తూ కూర్చున్నాడు ప్రభాకరం.

౧౮౩౮